సాక్షి
పల్నాడు
సోమవారం । 22 । సెప్టెంబర్ । 2025



గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ

శలపాడు (చేబ్రోలు): శలపాడులో ఆదివారం సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహాన్ని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆవిష్కరించారు. గ్రామ సర్పంచ్ మన్నెం శిరీష పాల్గొన్నారు.



స్టేషన్లలో జిల్లా ఎస్పీ తనిఖీ

లక్ష్మీపురం: గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని పట్టాభిపురం, అరండల్‌పేట పోలీస్ స్టేషన్లను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం తనిఖీ చేశారు.



దుర్గమ్మ సేవలో త్రివిక్రమ్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనక దుర్గమ్మను సినీ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు.



అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న ప్రభుత్వం



ప్రజా ప్రయోజనాలతో వార్తలు ప్రచురించినప్పుడు అధికార పార్టీకి మద్దతుగా లేకపోతే సంబంధిత విలేకరులపై కేసులు పెట్టడం అధికార దుర్వినియోగం అవుతుంది. ప్రజా ప్రయోజనాలతో ఎలాంటి వార్తలనైనా ప్రచురించే హక్కు పత్రికలకు ఉంటుంది. అలాంటి స్వేచ్ఛను అణచివేయడం దారుణమైన విషయం. విలేకరులపై కేసులు పెట్టడం, వారి కుటుంబాలను వేధించడం ఏ ప్రభుత్వానికైనా సరైన పద్ధతి కాదు. పత్రికా స్వేచ్ఛను అడ్డుకునే అధికారాన్ని రాజ్యాంగం ఎవరికీ కట్టబెట్టలేదు. స్వాతంత్ర్య పోరాటానికి ముందు నుంచి గళమెత్తిన పత్రికలు.. ఎన్నో అన్యాయాలను ఎదిరించి రాశాయి. అధికారాలను మార్చాయి. విలేకరులపై తప్పుడు కేసులు పెట్టే సంస్కృతిని ఎవరైనా ఖండించాల్సిందే.

– మెరుగుపాల రాజారత్నం, సీనియర్ జర్నలిస్ట్

విమర్శలకూ భయపడుతున్న కూటమి సర్కార్



ప్రభుత్వంపై విమర్శలు చేసిన వారిపై కేసులు పెట్టడం తొలిసారిగా కూటమి పాలనలోనే చూస్తున్నాం. గతంలో ఎక్కడా చూడలేదు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చని ప్రభుత్వం.. ఎవరైనా విమర్శిస్తే చాలు కేసులు పెడుతోంది. పత్రికలు విమర్శిస్తే చాలు కూటమి ప్రభుత్వం భయపడుతోంది. సాక్షి ఎడిటర్‌పై, విలేకరులపై ఇప్పటికైనా ప్రభుత్వం కక్షపూరిత కేసులు పెట్టడం మానుకోవాలి. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. లేదంటే ప్రజలే తిరగబడి ప్రశ్నిస్తారు. ఈ విషయాన్ని అధికారంలోని పాలకులు, ఆయా పార్టీల కీలక నాయకులు గుర్తించుకోవాలి.

– బుర్రముక్కు వేణుగోపాల స్వామి రెడ్డి, తాడేపల్లి పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, పొన్నూరు నియోజకవర్గ పరిశీలకులు

న్యూస్‌రీల్

అమరేశ్వరాలయంలో నేటి నుంచి దసరా వేడుకలు



అమరావతి: పవిత్ర శైవక్షేత్రమైన అమరావతి శ్రీబాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో సోమవారం నుంచి దసరా మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో రేఖ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిది రోజులపాటు చండీహోమం ఉంటుందని చెప్పారు. ఈ నెల 29వ తేదీ మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారికి సరస్వతీదేవి అలంకారం చేసి బాలలకు ఉచిత అక్షరాభ్యాసం శాస్త్రోక్తంగా నిర్వహిస్తామన్నారు. అక్టోబరు ఒకటో తేదీన రాత్రి 7 గంటలకు చండీ కల్యాణోత్సవం, శమీవృక్షం కింద ప్రత్యేక వేదికపై 2వ తేదీన శమీపూజ ఉంటాయని చెప్పారు. ఉదయం, సాయంత్రం భక్తులకు ఉచిత ప్రసాదాల పంపిణీకి ఏర్పాట్లు చేశామన్నారు. సోమవారం భక్తులు సమర్పించిన రజిత అభరణాలతో రజతకవచాలంకృత బాలచాముండేశ్వరి దేవిగా అమ్మవారిని అలంకరిస్తారని తెలిపారు. అలాగే, మెయిన్ రోడ్డులోని శ్రీ సీతాసమేత శ్రీ కోదండ రామస్వామి దేవస్థానంలోనూ తొమ్మిది రోజులపాలు సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజ, బతుకమ్మ పూజ ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

నాగులేరుకు పోటెత్తిన వరద నీరు



కారెంపూడి: నాగులేరుకు ఆదివారం వరద పోటెత్తింది. అర్ధరాత్రి నుంచి వాగుకు వరద పెరుగుతూ వచ్చింది. చాన్నాళ్ల తర్వాత నాగులేరు భారీ వరద నీటితో ప్రవహించింది. శనివారం రాత్రి మండలంలో కుండపోతగా వర్షం పడింది. నాగులేరు పరీవాహక ప్రాంతాలలో, అలాగే నల్లమల అడవిలో కూడా వర్షం కురిసింది. దీంతో ఆ ప్రాంతాలలోని నీరంతా నాగులేరుకు చేరింది. వీరుల గుడికి పడమరగా కారెంపూడి గ్రామం మధ్య నుంచి నాగులేరు ప్రవహిస్తోంది. ఈ దృశ్యాన్ని చూసేందుకు స్థానికులు వాగు వద్దకు తరలివచ్చారు. ఇదిలా ఉంటే నాగులేరు పరీవాహక ప్రాంతాలలో ఉన్న పంట పొలాలు నీట మునిగాయి. వరి, పూల తోటలు ఇతర పంటలన్నీ నీటిలో మునిగిపోయాయి. మండలంలోని సింగరుట్ల తండాకు వెళ్లే దారిలో ఉన్న చప్టాపై నుంచి నాగులేరు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది.

ప్రవేశ పరీక్షకు స్పందన



పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విద్యాలయం దూరవిద్యా కేంద్రం ఆధ్వర్యంలో 2025–26 విద్యా సంవత్సరానికిగాను నిర్వహించిన రెండేళ్ల ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశ పరీక్షకు అనూహ్య స్పందన లభించిందని కో–ఆర్డినేటర్ ఆచార్య దిట్టకవి రామచంద్రన్ తెలిపారు. దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లుతో కలసి ఆదివారం ఆయన ఏఎన్‌యూలో పరీక్ష తీరును పరిశీలించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం 10 కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష సజావుగా జరిగినట్లు పేర్కొన్నారు. మొత్తం 720 మంది దరఖాస్తు చేసుకోగా 522 మంది హాజరయ్యారన్నారు. ఇందులో ఎంబీఏకు 449 మంది, ఎంసీఏకు 73 మంది పరీక్ష రాశారని తెలిపారు. ఎంబీఏలో ఇప్పటికే ఉన్న స్పెషలైజేషన్‌తో పాటు నూతనంగా ఎంబీఏ ఫైనాన్స్, ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ వంటి కోర్సులు కావాలని విద్యార్థులు కోరారన్నారు. పరీక్షల ప్రత్యేక పరిశీలకులుగా కె. శ్రీధర్, ఎస్. బాబు వ్యవహరించారు. ఫలితాలు సోమవారం సాయంత్రం విడుదల అవుతాయని పరీక్షల కోఆర్డినేటర్ దిట్టకవి రామచంద్రన్ తెలిపారు.

పశ్చిమ డెల్టాకు 6,834 క్యూసెక్కులు

దుగ్గిరాల: ప్రకాశం బ్యారేజ్ నుంచి 6,834 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12 అడుగులు నీటిమట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవెల్‌కి 140 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్ 1,685, క్యూసెక్కులు, తూర్పు కాలువకు 607, పశ్చిమ కాలువకు 247, నిజాపట్నం కాలువకు 436, కొమ్మూరు కాలువకు 2,980 క్యూసెక్కులు, బ్యారేజి నుంచి సముద్రంలోకి 2,17,350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

సమస్యల నివాసాలు!

- టిడ్కో నివాస సముదాయంలో వెలగని వీధి దీపాలు
- ఇళ్ల మధ్య కంప చెట్లతో అడవిని తలపిస్తున్న పరిసరాలు
- పక్కనే ఉన్న జగనన్న కాలనీలో కూడా మౌలిక వసతులు కరువు

స్థానిక చిలకలూరిపేట రోడ్డులో 1,503 గృహాలతో నిర్మించిన టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టిడ్కో) సముదాయం, దాని పక్కనే ఉన్న స్థలంలో ఏర్పాటైన జగనన్న కాలనీలో పేద వర్గాలు భయానక పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. రాత్రి అయితే కనీసం విద్యుత్తు దీపాలు లేక వీధులన్నీ చిమ్మచీకటిలో ఉంటున్నాయి. దొంగలు, పాముల భయంతో బిక్కుబిక్కుమంటున్నారు. ఇళ్ల పరిసరాలు, డ్రైనేజీలు పిచ్చి మొక్కలు, తుమ్మ చెట్లతో నిండిపోయాయి. అంతర్గత రహదారులకు ఇరువైపులా ఈ చెట్లు అడవిని తలపిస్తున్నాయి.

నరసరావుపేట: టిడ్కో గృహాల నిర్మాణం గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించగా... వైఎస్సార్‌సీపీ సర్కారు వచ్చాక పూర్తి చేసింది. సుమారు 700 మంది లబ్ధిదారులకు గృహాలను అందజేశారు. సుమారు రూ.30 కోట్ల వ్యయంతో మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. ప్రధాన రోడ్డు నుంచి టిడ్కో గృహ సముదాయం వరకు మధ్యలో హైలెవల్ బ్రిడ్జి సహా సీసీరోడ్డు నిర్మాణం, నీళ్ల ట్యాంకు, డ్రెన్లు, విద్యుత్ సరఫరా కోసం ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు, సబ్‌స్టేషన్ నిర్మాణం చేశారు. ప్రస్తుతం వాటిలో 300 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మించిన వాటర్ ట్యాంకు పుణ్యమా అంటూ నివాసితులకు తాగునీరు లభిస్తోంది. రోడ్లకు ఇరువైపులా ఉన్న స్తంభాలకు ఏర్పాటు చేసిన వీధిలైట్లు వర్షాలు, హైఓల్టేజ్ కారణంగా దెబ్బతిన్నాయి. మళ్లీ ఏర్పాటు చేసేవారే లేకుండాపోయారు. చిమ్మచీకటిలోనే ప్రజలు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. పిచ్చి కంప చెట్లు భారీగా పెరగడంతో పెద్ద పాములు



జగనన్న కాలనీలోని డ్రైనేజీ వ్యవస్థ, రహదారి లేని ఓ వీధి

రాత్రి సమయాల్లో రోడ్లపై తిరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. మహిళలు, పిల్లలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. పట్టణంలో పనులు పూర్తి చేసుకొని రాత్రి ఎనిమిది గంటల తర్వాత టిడ్కో గృహాలకు మహిళలు రావాలంటే భయపడాల్సి వస్తోంది. వీధి దీపాలు లేక పోవటంతో మెయిన్ రోడ్డులో కొంతమంది యువకులు గంజాయి తాగుతూ, మరికొందరు మద్యం మత్తులో సంచరిస్తున్నారని మహిళలు వాపోతున్నారు. వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

జగనన్న కాలనీపైనా అదే నిర్లక్ష్యం

ప్రస్తుత కూటమి ప్రభుత్వం జగనన్న కాలనీపై సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తోంది. కనీస వసతులు కల్పించేందుకు ఏడాదిన్నరగా రూపాయి కూడా ఖర్చు చేయలేదు. గత ప్రభుత్వం టిడ్కో సముదాయం పక్కన ఈ కాలనీ ఏర్పాటు చేసి పురపాలక పరిధిలోని సుమారు 600 మందికి పట్టాలు అందజేసింది. వాటిలో కొంతమంది ఇప్పటికే ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. మరికొంతమంది ఇప్పుడిప్పుడే ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఇక్కడ రోడ్లు లేవు. డ్రైనేజీ వ్యవస్థ నిర్మించలేదు. వీధి దీపాలు, తాగునీటి ఊసే లేదు. తాగునీటి కోసం తామంతా బయటకు వచ్చి మినరల్ వాటర్ తెచ్చుకోవాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. వర్షం పడితే రెండు మూడు అడుగుల లోతు నీటిలో రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాపోతున్నారు.

త్వరలో వీధిదీపాల ఏర్పాటు

మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, డీఈ రఫీక్‌లను వివరణ కోరగా.. టిడ్కో గృహాల మధ్య పెరిగిన పిచ్చిచెట్లు తొలగింపు, డ్రైనేజీలను శుభ్రం చేసే పనులు ప్రారంభించామన్నారు. మొత్తం 80 వీధి దీపాలు ఉండగా.. వాటిలో 40కుపైగా పని చేయడం లేదన్నారు. వాటిలో 20 నూతన లైట్లు బిగించామన్నారు. మరికొన్ని లైట్ల కోసం రూ.5 లక్షలతో టెండర్లు పిలిచామని, మిగతావి త్వరలో ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. జగనన్న కాలనీని హౌసింగ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారని, పురపాలక సంఘానికి అప్పగించలేదని తెలిపారు.



టిడ్కో సముదాయం వద్ద డ్రైనేజీలో పిచ్చి మొక్కలు



టిడ్కో గృహాల పరిసరాల్లో పెరిగిన తుమ్మచెట్లు

సత్తెనపల్లిలో భారీ వర్షం



నందిగామలో చప్టాపై నీటి ఉద్ధృతికి కొట్టుకుపోతున్న ద్విచక్ర వాహనాన్ని పట్టుకుంటున్న దృశ్యం

- జలమయంగా మారిన లోతట్టు ప్రాంతాలు
- రాకపోకలకు అవస్థలు పడిన ప్రజలు
- నందిగామలో పొంగిపొర్లిన లో లెవెల్ చప్టా
- గుంటూరు రోడ్‌లో నేలకూలిన భారీ వృక్షం
- ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులకు ఇక్కట్లు

సత్తెనపల్లి: సత్తెనపల్లి నియోజకవర్గంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వాన కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రధాన రహదారులపై సైతం నీరు భారీగా నిలిచింది. ప్రజలు అవస్థలు పడ్డారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో కాలువలు పొంగిపొర్లాయి. మురుగునీటితోపాటు వాననీరు చేరడంతో స్థానికులకు ఇబ్బందులు తప్పలేదు. ఈదురు గాలులకు గుంటూరు రోడ్‌లోని గుంటూరు బ్రాంచ్ కెనాల్ కాలువ సమీపంలో భారీ వృక్షం నేలకూలింది. దాదాపు ముప్పావు గంటకుపైగానే ట్రాఫిక్ నిలిచిపోయింది. వృక్షాన్ని తొలగించి అధికారులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. నందిగామలో లో లెవెల్ చప్టాపై నుంచి వర్షపు నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. గుర్రపుడెక్క ఎక్కువగా పెరగడంతో ఈ సమస్య తలెత్తింది. కొందరు ద్విచక్ర వాహనాలతో కొట్టుకుపోతుండగా స్థానికులు కాపాడారు. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని నాగన్నకుంట ఏరియా, సుందరయ్య కాలనీ, మాస్టిన్‌పేట, దోబీఘాట్ తదితర ప్రాంతాల్లో స్థానికులు ఇబ్బంది పడ్డారు.



సుందరయ్య కాలనీలో వర్షపునీరు



నందిగామలో చప్టా పైనుంచి నీరు ప్రవహిస్తుండటంతో గుర్రపు డెక్కను తొలగిస్తున్న స్థానికులు

భద్రతకేదీ భరోసా?

- పల్నాడు జిల్లాలో కీలక డీఎస్పీ పోస్టు ఖాళీ
- నరసరావుపేట డీఎస్పీని నియమించని కూటమి ప్రభుత్వం
- రెండు నెలలుగా ఇన్‌చార్జి డీఎస్పీతోనే నరిపెట్టిన సర్కారు
- కొత్త జిల్లాకు మంజూరు కాని ఎస్బీ డీఎస్పీ పోస్టు
- సీఐ స్థాయి అధికారులతో నెట్టుకొస్తున్న ఉన్నతాధికారులు
- రోజురోజుకూ పెరిగిపోతున్న అసాంఘిక కార్యకలాపాలు
- శాంతిభద్రతల పరిరక్షణపై తీవ్ర ప్రభావం
- కనీసం పట్టించుకోని కూటమి ప్రభుత్వం

వినుకొండలో నడిరోడ్డుపై వ్యక్తిని నరికి చంపగా చిందిన నెత్తుటి మరక పల్నాడునేకాదు రాష్ట్రాన్నే ఉలిక్కిపడేలా చేసింది. ఇది మరవక ముందే నరసరావుపేట నడిబొడ్డున కోర్టు ప్రాంగణం సాక్షిగా తండ్రి, కుమారుడిని పట్టపగలు కిడ్నాప్ చేసి హతమార్చిన ఉదంతం శాంతిభద్రతలపై వందల ప్రశ్నలు మిగిల్చింది. ఓ హెడ్ కానిస్టేబుల్ పాస్‌పోర్టు కోసం లంచం తీసుకున్నాడంటూ సోషల్ మీడియాలో వైరలైన వీడియోలు ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపాన్ని చాటిచెబుతున్నాయి. ఇంత జరుగుతున్నా పల్నాడులో కీలకమైన డీఎస్పీ పోస్టులు ఖాళీగా ఉండటం కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది

నరసరావుపేట టౌన్: పల్నాడు జిల్లా శాంతిభద్రతల పరంగా అత్యంత సమస్యాత్మక ప్రాంతం. గత సాధారణ ఎన్నికల పోలింగ్ రోజు నరసరావుపేట నడిబొడ్డున మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇంటిపై రౌడీ మూకలు దాడులకు తెగబడ్డాయి. అప్పటి నుంచి జిల్లా కేంద్రంలో శాంతిభద్రతలు, ఆర్థిక మోసాలతో నిత్యం ఏదో ఒక అలజడి రేగుతూనే ఉంది. మరోవైపు వినుకొండ, నరసరావుపేటలో నడిరోడ్లపై హత్యలు, కిడ్నాపులతో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోంది. నరసరావుపేటలో ఆర్థిక మోసాలు రోజుకొకటి వెలుగుచూస్తున్నాయి. సాయి సాధన చిట్‌ఫండ్స్ పేరిట పుల్లారావు చేసిన మోసానికి రూ.వందల కోట్లు నష్టపోయిన బాధితుల వేదనలకు పోలీసుల వద్ద సమాధానాలు కరువయ్యాయి. దీంతోపాటు యానిమేషన్ పేరిట కిరణ్ అనే వ్యక్తి స్కామ్ చేసి నరసరావుపేటలో వందల మందిని ముంచినా న్యాయం మాత్రం అందనంత దూరంలోనే నిలిచింది. ఇటీవల రెండు ప్రముఖ ద్విచక్ర వాహన డీలర్లు రూ.కోట్లలో అప్పులు చేసి ఉడాయించడంతో బాధితులు రోడ్డునపడ్డారు. అదేవిధంగా పేకాట, బెట్టింగ్, రేషన్ మాఫియా ఆగడాలు రోజురోజుకూ శ్రుతి మించుతున్నాయి. నరసరావుపేట పోలీసు సబ్ డివిజన్‌లో శాంతిభద్రతల వైఫల్యాన్ని ఇలాంటి ఘటనలు వెక్కిరిస్తున్నాయి.



నరసరావుపేట డీఎస్పీ కార్యాలయం

ఇన్‌చార్జి డీఎస్పీయే దిక్కు

కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పల్నాడు జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతూనే ఉందని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజుల క్రితం జీరో ఎఫ్ఐఆర్‌పై ఒక మహిళా న్యాయవాది సోషల్ మీడియా వేదికగా నరసరావుపేట పోలీసు అధికారులను నిలదీశారు. ఈ క్రమంలో అన్నింటినీ పర్యవేక్షించే వారు లేకపోవడమే కారణమన్న సమాధానాలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది జూలై నెలలో నరసరావుపేట డీఎస్పీగా పనిచేసిన కె.నాగేశ్వరరావు పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో ఎవరినీ నియమించకపోవటంతో సత్తెనపల్లి డీఎస్పీ ఎం. హనుమంతరావు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. రెండు నెలలుగా ఆయన రెండు సబ్ డివిజన్లకు డీఎస్పీగా పనిచేస్తున్నారు. జిల్లాలోనే పెద్దదైన నరసరావుపేట సబ్ డివిజన్ పరిధిలో 13 పోలీసుస్టేషన్లు, ఒక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఉన్నాయి. శాంతిభద్రతల అదుపులో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో సత్వరన్యాయం అందడంలో జాప్యం చోటుచేసుకుంటోందని బాధితులు వాపోతున్నారు.

స్పెషల్ బ్రాంచ్‌కు బాస్ ఏరీ?

నిఘా వ్యవస్థ పటిష్టంగా ఉండాలన్నా, ప్రజలకు సంతప్తికరమైన సేవలు అందాలన్నా పోలీసు వ్యవస్థలో స్పెషల్ బ్రాంచ్ సేవలు ఎంతో కీలకం. ముందస్తు సమాచారం తెలుసుకొని జరగబోయే అవాంఛనీయ సంఘటనల నివారణలో ఎస్బీ ముఖ్యభూమిక పోషిస్తుంది. పల్నాడు జిల్లాలో స్పెషల్ బ్రాంచ్ సేవలు సక్రమంగా లేవనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్తగా ఏర్పడిన ఈ జిల్లాకు కీలకమైన ఎస్బీ డీఎస్పీ పోస్టు మంజూరు కాలేదు. అప్పటి నుంచి సీఐ స్థాయి అధికారుల పర్యవేక్షణలోనే స్పెషల్ బ్రాంచ్ నడుస్తోంది. జిల్లాలో నేరాలపై సరైన సమాచారం లేక శాంతిభద్రతల పరిరరక్షణలో విఫలమవుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా దొంగతనాలు పెచ్చుమీరాయి. పట్టపగలు వినుకొండ పట్టణంలో ఒంటరి మహిళలను హత్యచేసి దోపిడీలకు పాల్పడుతున్నారు. పార్క్ చేసిన ద్విచక్రవాహనాలు క్షణాల్లో మాయం అవుతున్నాయి. ఎక్కడికక్కడ జూద శిబిరాలు వెలిశాయి. నిఘా వైఫల్యం కారణంగానే ఇవన్నీ యథేచ్ఛగా జరుగుతున్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. దీంతోపాటు పాస్‌పోర్టు విచారణలో సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారనే విమర్శలూ ఉన్నాయి. అమరావతిలో హెడ్ కానిస్టేబుల్ ఒకరు పాస్‌పోర్టు జారీలో రూ.2 వేలు లంచం తీసుకొని కింద నుంచి పై స్థాయి అధికారుల వరకు ఇచ్చినట్లు చెప్పిన వీడియో వైరల్ అయ్యింది.

అతిసార కట్టడికి ఇంటింటి సర్వే

- జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా
- 33 బృందాలు ఏర్పాటు

గుంటూరు వెస్ట్: అతిసార లక్షణాలు కనిపించిన ప్రాంతాల్లో 33 బృందాలతో ఇంటింటి సర్వే జరుగుతోందని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి అందించిన వివరాల మేరకు, 16వ తేదీ నుంచి ఇప్పటి వరకు 80 కేసులు నమోదు అయ్యాయని పేర్కొన్నారు. మిగిలిన కేసులు అంతకముందు విరేచనాలు లేదా వాంతులు తదితర కారణాలుతో నమోదయ్యాయని తెలిపారు. అత్యవసర వార్డు నుంచి సాధారణ వార్డులకు 13 మందిని మార్చారని, 11 మంది డిశ్చార్జి అయినట్లు వివరించారు. పాత గుంటూరు, సంగడి గుంట, ఎల్.బి. నగర్ తదితర ప్రాంతాలను రెడ్ జోన్‌గా గుర్తించి విస్తృతంగా సర్వే చేస్తున్నామని వెల్లడించారు. సర్వే చేస్తున్న ప్రాంతాల్లో అతిసార లక్షణాలున్న ఆరుగురికి అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స అందించామని తెలిపారు. అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు రేయింబవళ్లు పనిచేసే విధంగా చర్యలు చేపట్టామని వివరించారు. వ్యాధుల సమాచారం అందించేందుకు కంట్రోల్ రూమును 08963-2234014 నంబరులో సంప్రదించాలని కోరారు. పారిశుద్ధ్య నిర్వహణ, రక్షిత తాగునీటి సరఫరా బాధ్యత అధికారులదేనని తెలిపారు. రహదారి పక్కన తినుబండారాల విక్రయాలను ఆదివారం అధికారులు తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

డాక్టర్ సునీల్‌కు 'ప్రైడ్ ఆఫ్ ఏపీ' అవార్డు



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణానికి చెందిన కంటి వైద్య నిపుణులు డాక్టర్ పెంట్యాల సునీల్‌కుమార్‌కు 'ప్రైడ్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' నేత్ర వైద్యుల సంఘం అవార్డు వరించింది. సోషల్ మీడియాలో 'టిప్ ఆఫ్ ది డే' ద్వారా నేత్ర వైద్య మెలకువలను ప్రజలకు వివరిస్తున్నందుకుగానూ గుంటూరులో ఆదివారం జరిగిన రాష్ట్ర నేత్ర వైద్యుల సదస్సులో ఈ అవార్డును సునీల్‌కుమార్ అందుకున్నారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. తనను ఈ అవార్డు రావటం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. డాక్టర్ సునీల్‌కుమార్‌ను పలువురు పట్టణ ప్రముఖులు అభినందించారు.

సమష్టి కృషితో డివిజన్‌లో అద్భుతమైన పురోగతి

రైల్వే డివిజన్ పీఆర్‌ఓ డి.వినయ్‌కాంత్

లక్ష్మీపురం: అధికారులు, ఉద్యోగుల సమష్టి కృషి ఫలితంగా గుంటూరు రైల్వే డివిజన్ అద్భుతమైన పురోగతి సాధిస్తుందని గుంటూరు రైల్వే డివిజన్ పీఆర్‌ఓ డి.వినయ్‌కాంత్ తెలిపారు. ఆదివారం గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ఈ ఏడాది సాధించిన విజయాలు, అభివృద్ధి వివరాలు వెల్లడించారు. 3.809 మిలియన్ టన్నుల సరకు రవాణా చేయగా రూ.712 కోట్ల ఆదాయం సమకూరినట్లు తెలిపారు. గతేడాది కంటే 6.1 శాతం ఎక్కువ అని తెలిపారు. నడికుడి-శ్రీకాళహస్తి లైను 309 కిలోమీటర్లు కాగా ఇప్పటి వరకు 90 కి.మీ పూర్తయిందన్నారు. ఎర్రుబాలెం-నంబూరు (56.53 కి.మీ) లైను ఏపీ రాజధాని అమరావతిని కలుపుతుందని, భూసేకరణ పురోగతిలో ఉందన్నారు. నల్లపాడు-నంద్యాల 12 కి.మీ పూర్తయిందని తెలిపారు. నవంబర్ 2025 నాటికి గురజాల-నంద్యాల పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, డిసెంబర్ 2026 నాటికి దిగువమెట్ట-గురజాల (40 కి.మీ) పూర్తి చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. నల్లపాడు-పిడుగురాళ్ల 30 కి.మీ పూర్తి చేయనున్నట్లు తెలిపారు. డివిజన్ పరిధిలో 16 రైల్వేస్టేషన్‌లను అమృత్ భారత్ స్టేషన్‌ల పునరాభివృద్ధి కోసం రూ.300 కోట్లు మంజూరు చేసినట్లు తెలియజేశారు.

కృష్ణా నదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం




కొల్లూరు : కృష్ణా నదీ వరద ప్రవాహంలో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం కొట్టుకొచ్చి, నది అంచుల వద్ద పొదల్లో తేలింది. ఆదివారం ఉదయం మండలంలోని ఈపూరులంకలో పంట పొలాల వద్దకు వెళ్లిన రైతులు నది ఒడ్డు వెంబడి 60 సంవత్సరాల వరకు ఉన్న ఓ పురుషుడి మృతదేహం తేలి ఉండటాన్ని గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో రెవెన్యూ సిబ్బందితో కలసి అక్కడకు వెళ్లారు. రెండు రోజుల కిందట విజయవాడ ప్రకాశం బ్యారేజ్ వద్ద నదిలోకి దూకి గల్లంతైన వ్యక్తి మృతదేహం అయి ఉండవచ్చన్న అనుమానంతో కొల్లూరు పోలీసులు తాడేపల్లి, విజయవాడ పోలీసులకు సమాచారం అందించారు. అయితే, మృతదేహం విజయవాడ వద్ద నదిలో దూకిన వ్యక్తిది కాదని అతని బంధువులు నిర్ధారించారు. నది ఒడ్డున పొదల్లో ఆచూకీ కోసం పోలీసులు ప్రయత్నించినప్పటికీ ప్రయోజనం లభించలేదు. బట్టతలతో, లేత గోధుమ రంగు చొక్కా, బ్లూ ప్యాంట్ ధరించి, చేతికి ఎర్రని దారంతో ఆంజనేయ స్వామి లాకెట్ కట్టి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం అనంతరం శవాగారంలో భద్రపరచనున్నట్లు ఎస్‌ఐ జానకీ అమర్‌వర్ధన్ తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరపనున్నట్లు చెప్పారు.

క్యాన్సర్‌కూ ఉంది ఆన్సర్

- బాధితులకు భరోసా
- గుంటూరు జీజీహెచ్‌లో ఉచితంగా కార్పొరేట్ వైద్యం
- ఆధునిక చికిత్సలతో నివారణ
- నేడు వరల్డ్ రోజ్ డే

గుంటూరు మెడికల్: క్యాన్సర్ .. ఈ వ్యాధి పేరు చెబితేనే చాలా మందికి ఒంట్లో వణుకు పుడుతుంది. వస్తే చనిపోవటమే అనే అపోహల్లో ప్రజలు ఉన్నారు. పూర్వ రాచపుండుగా పిలువబడే క్యాన్సర్ వ్యాధికి చికిత్స ఉండేది కాదు. వ్యాధిగ్రస్తులు మరణానికి రోజులు లెక్క బెట్టుకుంటూ గడిపేవారు. ప్రస్తుతం ఈ పరిస్థితి మారింది. ఆధునిక వైద్యం అందుబాటులోకి వచ్చింది. వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు. బాధితుల్లో భయాన్ని పోగొట్టి వారిలో మానసిక ధైర్యాన్ని నింపేందుకు ప్రతి ఏడాది ప్రపంచ వ్యాప్తంగా సెప్టెంబరు 22న రోజ్ డే వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

రోజ్ డే నేపథ్యం



కెనడా దేశానికి చెందిన 12 ఏళ్ల మెలిండా రోజ్ అనే బాలిక 1994లో క్యాన్సర్ వ్యాధికి గురైంది. అది కూడా చాలా అరుదైన బ్లడ్ క్యాన్సర్. కొన్ని వారాల్లోనే చనిపోతుందని దాక్టర్లు చెప్పడంతో తల్లిదండ్రులు చాలా బాధపడ్డారు. కాని రోజ్ భయపడకుండా ఆస్పత్రిలో ఉన్న రోగులకు రోజా పువ్వులు అందించేది. వారికి కవితలు వినిపించి రోగుల్లో మనో ఉల్లాసాన్ని కలిగించేది. ఇలా ఆరునెలల పాటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రోగులను చిరునవ్వుతో పలుకరిస్తూ ఉండేది. ఉత్తరాలు రాస్తూ వారిలో ఆనందం, ఉత్సాహాన్ని నింపుతూ సెప్టెంబరు 22న మరణించింది. ఆ బాలిక జ్ఞాపకార్థం ప్రతి ఏడాది రోజ్ డేను నిర్వహిస్తున్నారు.

క్యాన్సర్ కారణాలు

క్యాన్సర్ రావటానికి ప్రధాన కారణం పొగాకు ఉత్పత్తుల వినియోగమే. సిగిరెట్, బీడీ, చుట్ట , పాన్‌పరాగ్, ఖైనీ, గుట్కా.. ఇలా ఏ రూపంలో పొగాకును తీసుకున్నా వస్తుంది. మద్యపానం, వ్యాయామం చేయకపోవడం, ఆకు కూరలు తినకపోవడం, ఊరగాయ పచ్చళ్లు, కొవ్వు ఎక్కువగా ఉన్న మాంసాహారం తినడం, అధిక బరువు ఉండటం వల్ల కొన్ని రకాల క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉంది.

జీజీహెచ్‌లో చికిత్స పొందిన వారి వివరాలు

సంవత్సరం	రోగుల సంఖ్య	ఆపరేషన్లు
2020	2067	-
2021	5,865	114
2022	13,107	395
2023	14,647	753
2024 ఆగస్టు వరకు	9,376	542



జీజీహెచ్‌లోని క్యాన్సర్ వార్డు



పెట్‌స్కాన్ వైద్య పరికరం

జీజీహెచ్‌లో అత్యాధునిక వైద్య సేవలు

గుంటూరు జీజీహెచ్‌లో 2020 జులైలో అత్యాధునిక క్యాన్సర్ వైద్య సేవలు అందించేందుకు నాట్కో క్యాన్సర్ సెంటర్‌ను మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. కోట్ల రూపాయలతో పెట్ స్కాన్‌ను ఏర్పాటు చేశారు. 100 పడకలతో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారు.

అందుబాటులో ఆధునిక వైద్యం



క్యాన్సర్‌కు నేడు ఆధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. ఇమ్యూనోథెరపీ, టార్గెట్‌థెరపీ ద్వారా త్వరగా కోలుకుంటున్నారు. నెక్స్ జనరేషన్ సీక్వెన్సింగ్ టెస్ట్ ద్వారా చాలా త్వరగా గుర్తించవచ్చు. ఏ జీన్‌లో తేడా వల్ల సోకుతుందనే విషయం తేటతెల్లమవుతుంది. కుటుంబంలో ఒకరికి క్యాన్సర్ ఉంటే ఇతరులకు వచ్చే అవకాశం ఉందా లేదా నిర్ధారించే బీఆర్‌సీఏ-1, 2 పరీక్షలు ఉన్నాయి. లాప్రోస్కోపిక్, రొబోటిక్ సర్జరీలు అందుబాటులో ఉన్నాయి.

–డాక్టర్ ఎం.జి.నాగకిశోర్, సీనియర్ సర్జికల్ అంకాలజిస్ట్, గుంటూరు

అన్నీ ఉచితమే..



రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రూ. 45 కోట్లతో ప్రభుత్వ సహకారంతో గుంటూరు జీజీహెచ్‌లో నాట్కో క్యాన్సర్ సెంటర్ ఏర్పాటైంది. ప్రపంచస్థాయి వైద్య ప్రమాణాలతో వ్యాధిగ్రస్తులకు ఉచితంగా కార్పొరేట్ వైద్య సేవలు అందిస్తున్నాం. రూ. కోట్లు ఖరీదు చేసే అత్యాధునిక లీనియర్ యాక్సిలేటర్, బ్రాకీథెరపీ, సీటీ స్టిమ్యులేటర్, పెట్‌స్కాన్ వైద్య పరికరాలు ప్రభుత్వం అందజేసింది. క్యాన్సర్ చివరి దశలో ఉన్నవారికి సైతం ప్యాలేటీవ్ కేర్ చికిత్సలు అందిస్తున్నాం. మందులు కూడా ఉచితంగా అందించి రోగుల్లో మనో ధైర్యం కల్పిస్తున్నాం. మరో వంద పడకలతో క్యాన్సర్ సెంటర్‌ను నిర్మాణం చేస్తున్నాం.

– నన్నపనేని సదాశివరావు, నాట్కో ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్

స్క్రీనింగ్ పరీక్షలతో చెక్



స్క్రీనింగ్ పరీక్షల ద్వారా క్యాన్సర్‌కు చెక్ పెట్టవచ్చు. ముఖ్యంగా మహిళలు 45 సంవత్సరాలు దాటాక ప్రతి ఏడాది మ్యామో గ్రామ్ పరీక్ష చేయించుకోవాలి. 55 సంవత్సరాలు దాటిన వారు సీ టీ స్కాన్, కొలనోస్కోపి చేయించుకోవాలి. తొమ్మిదేళ్ల నుంచి 11 ఏళ్లలోపు బాలికలకు, 45 సంవత్సరాల్లోపు మహిళలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించడం ద్వారా క్యాన్సర్ రాకుండా నివారించవచ్చు. హెపటైటీస్ బీని కూడా వ్యాక్సిన్ వేయించుకుని రాకుండా నిరోధించవచ్చు.

– డాక్టర్ బైరపనేని స్రవంతి, మెడికల్ అంకాలజిస్ట్

రేవేంద్రపాడులో 'వెయిట్ లిఫ్టింగ్' ఎంపికలు



దుగ్గిరాల: విద్యార్థులు చదువుతో పాటు ఆటలు కూడా ముఖ్యమని అని హెచ్.ఎం బి.వి.కృష్ణారావు చెప్పారు. మండలంలోని రేవేంద్రపాడు జెడ్పీ హైస్కూలులో ఆదివారం జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ జట్టు ఎంపికలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గేమ్స్ ఫెడరేషన్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో 17 నుంచి 19 సంవత్సరాల బాలబాలికల విభాగంలో ఎంపికలు జరిగినట్లు తెలిపారు. విద్యార్థులు చురుగ్గా ఉండటానికి ఆటలు ఆడాలని, దేహ దారుఢ్యం కూడా పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు నాగ శిరీష, రాంబాబు, వివిధ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

99 అడుగుల మహాగణపతి కమిటీపై ఫిర్యాదు

గుంటూరు రూరల్: తమలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించుకుని డబ్బులు ఇవ్వకుండా పరారయ్యారని జిల్లా ఎస్పీకి కళాకారులు ఆదివారం ఫిర్యాదు చేశారు. బాధితుడు, శ్లోక ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గంట స్వామి ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. రెడ్డిపాలెం ఇన్నర్ రింగ్ రోడ్‌లోని శ్రీ చైతన్య కళాశాల గ్రౌండ్ 99 అడుగుల మట్టి మహాగణపతిని ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసింది. నగరంలో ఉన్న వివిధ సాంస్కృతిక సంస్థలతో కలసి శ్లోకా ఫౌండేషన్ ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 20 వరకు నిత్యం శాస్త్రీయ నృత్యాలతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహించింది. ఉత్సవాల అనంతరం కళాకారులకు సొమ్మును ఇవ్వకుండా కమిటీ ప్రెసిడెంట్ నరేంద్రరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రాజానాయుడు, సెక్రటరీ లక్ష్మీరెడ్డిలు అందుబాటులో లేరని ఫిర్యాదు చేశారు. ఫోన్ ద్వారా కూడా సమాధానం చెప్పకుండా తప్పించుకొని వెళ్లి పోయారని ఆరోపించారు. కళాకారులు, చిన్నారులు, మహిళలు, మేకప్ మేన్‌కు రూ 1,75,000 ఇవ్వాలని తెలిపారు. వెంటనే నగదు ఇప్పించాలని స్వామి ఎస్పీకి విజ్ఞప్తి చేశారు.

గుర్తుకొస్తున్నాయి..!

41 ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు



నాటి అధ్యాపకులతో శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల 1981-84 బ్యాచ్ డిగ్రీ విద్యార్థులు

నరసరావుపేట: స్థానిక శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో 1981-84 బీఏ డిగ్రీ చదివిన ఆనాటి విద్యార్థుల సమ్మేళనం కళాశాలలోని ఆడిటోరియంలో ఆదివారం జరిగింది. అప్పటి 78 మంది విద్యార్థుల్లో 45 మంది సమ్మేళనానికి హాజరై, నాటి రోజులను గుర్తుచేసుకున్నారు. తాము చేసిన అల్లరి, చిలిపి పనులను నెమరు వేసుకున్నారు. తమ విజ్ఞప్తి మేరకు హాజరైన అప్పటి అధ్యాపకులు, మాజీ ప్రిన్సిపాల్ ఎంఆర్‌కే మూర్తి, హరిహరనాథ శాస్త్రి, శివధర్మశాస్త్రి, రాజాశంకరరావు, గ్రంథాలయాధికారి, కేవీకే రామారావులను ఘనంగా సన్మానించారు. ప్రస్తుతం తమ యోగక్షేమాలు, ఆరోగ్య పరిస్థితులు, తమ కుటుంబాలు, పిల్లలను గురించి ఒకరినొకరు పంచుకున్నారు. కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్ చేసిన విజ్ఞప్తి మేరకు అప్పటి విద్యార్థి నేటి గ్రానైట్ వ్యాపారి అయిన దేచవరం గ్రామానికి చెందిన బి.శివన్నారాయణ కళాశాల క్లాస్‌రూమ్‌ల ఆధునీకీకరణకు రూ.2లక్షలు విరాళం ప్రకటించారు. పూర్వ విద్యార్థి ఎస్.సత్యనారాయణరెడ్డి మరో రూ.లక్ష ప్రకటించారు. చనిపోయిన 22 మంది తోటి విద్యార్థులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అందరూ కలిసి భోజనాలు చేసిన అనంతరం మరోసారి కలుసుకుందామనే అంగీకారంతో బరువైన హృదయాలతో కళాశాల వీడారు. ఈ సమ్మేళనానికి అప్పటి విద్యార్థులైన జమ్ముల రాధాకృష్ణ, ఎస్.శ్రీనివాసులురెడ్డి, బొగ్గరం మూర్తి, ఇనగంటి శ్రీనివాసరెడ్డి చొరవ తీసుకోగా తాళ్ల రాజశేఖరరెడ్డి, చల్లా శ్రీనివాసరావు, గుర్రం కొండ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణంలో ఘర్షణ

ముప్పాళ్ళ: మండల కేంద్రమైన ముప్పాళ్ళలోని మద్యం దుకాణంలో బాలుడిపై ఐదుగురు యువకులు దాడికి పాల్పడిన సంఘటన శనివారం రాత్రి జరిగింది. సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. చాగంటివారిపాలెం గ్రామానికి చెందిన ఐదుగురు యువకులు మద్యం సేవిస్తూ గతంలో నెల కొన్న చిన్నపాటి వివాదం గుర్తుకు చేసుకొని ఇంటివద్ద ఉన్న బాలుడిని మద్యం దుకాణం వద్దకు పిలిపించుకొని దాడికి పాల్పడ్డారు. దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు కావటంతో చికిత్స నిమిత్తం సత్తెనపల్లి వైద్యశాలకు తరలించారు. దాడికి పాల్పడిన యువకులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. దాడికి పాల్పడిన వారిపై గతంలోను కేసులు ఉన్నట్లు సమాచారం.

ఆశా కార్యకర్తలకు కనీస వేతనాలు అమలు చేయాలి

జిల్లా మహాసభలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి



మాట్లాడుతున్న ధనలక్ష్మి

నరసరావుపేట: ఇరవై ఏళ్లుగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల పేదలకు అందుబాటులో ఉంటూ ఆరోగ్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనాలు అమలు చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. స్థానిక వినుకొండరోడ్డులోని సీతా మహాలక్ష్మి ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన యూనియన్ పల్నాడు జిల్లా రెండో మహాసభకు యూనియన్ నాయకులు చంద్రకళ, ఎం.రత్నకుమారి, వి.రాజేశ్వరి అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. సీఐటీయూ జెండాను యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ ఆవిష్కరించగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి ఏచూరి సీతారాం, సీతామహాలక్ష్మి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ధనలక్ష్మి మాట్లాడుతూ గౌరవ వేతనంతో విశేష సేవలు అందించేందుకు ముందుకు వచ్చిన సామాజిక కార్యకర్తలే ఆశా వర్కర్లన్నారు. సంఘాలు బలోపేతం చేసుకుని పోరాటాలు సాగించి హక్కులు సాధించుకోవాలన్నారు. షుగర్, బీపీ, లెప్రసీ, టీబీ, ఎయిడ్స్ వంటి అనేక రకాల వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఆశా వర్కర్లు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని అన్నారు. పనిచేయని ఫోన్లు, సిమ్‌లు వంటి సమస్యలు పరిష్కరిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీలకు రాతపూర్వకంగా జీఓలు ఇవ్వాలన్నారు. మేనిఫెస్టో ప్రకారం ఆశావర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మెరుగైన ఆరోగ్య వ్యవస్థ లేకుండా ఆశాలు ఇంటింటికి తిరిగి చేసిన సర్వేలతో ఏం ప్రయోజనమని ప్రశ్నించారు. ప్రజారోగ్యం కోసం జీడీపీలో ఆరు శాతం నిధులు కేటాయించాలని అన్నారు. అదనపు విధులు, ఆశాలకు సంబంధం లేని పనులు అప్పగించరాదన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్, శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి మాట్లాడుతూ స్కీమ్ వర్కర్ల హక్కుల సాధన, సంక్షేమం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన పోరాటాలు సత్ఫలితాలిచ్చాయన్నారు. ఆశా వర్కర్లు చేపట్టే పోరాటాలకు యూనియన్ అండగా ఉంటుందని, పోరాడి హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు.

జిల్లా కార్యవర్గం ఎన్నిక ..

అనంతరం ఆశా వర్కర్స్ యూనియన్ పల్నాడు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలుగా కె.చంద్రకళ, గౌరవ అధ్యక్షురాలుగా డి.శివకుమారి, ప్రధాన కార్యదర్శి ఎం.రతకుమారి, కోశాధికారి ధనలక్ష్మి, మరికొందరిని సభ్యులుగా మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వర్షం నీటిలో పడి వ్యక్తి మృతి



లక్ష్మీపురం: మద్యం మత్తులో వర్షపు నీటిలో పడి వంట మాస్టర్ మృతి చెందిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. గుంటూరులోని ముత్యాలరెడ్డి నగర్ 1వ లైన్ ప్రాంతానికి చెందిన చింతాబత్తిన కుమార్ బాబు (35) అరండల్‌పేట 10వ లైన్‌లోని మెస్‌లో వంట మాస్టర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. భార్య దుర్గాదేవి బొంగరాల బీడు యూపీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తోంది. కుమార్ బాబు శనివారం అర్ధరాత్రి పూటుగా మద్యం తాగి డొంక రోడ్డు మూడు వంతెనల సెంటర్ వద్ద వర్షపు నీటిలో పడి మృతి చెందాడు. స్థానికులు భార్య దుర్గాదేవికి సమాచారం తెలియజేయడంతో హుటాహుటిన చేరుకుని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. దుర్గాదేవి ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని ప్రభుత్వ సమగ్రాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.


25న విజయవాడలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితుల రక్షణపై ధర్నా



మాట్లాడుతున్న కేవీపీఎస్ నాయకుడు, పక్కన పలు సంఘాల నాయకులు

లక్ష్మీపురం: 'దళితులపై దాడులు, అత్యాచారాలు ఆగాలంటే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, లేకుంటే బాధితులకు న్యాయం జరగదని కుల వివక్ష వ్యతిరేక సంఘం(కేవీపీఎస్) రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి అన్నారు. దళితులు, బహుజనులపై జరుగుతున్న అత్యాచారాలు, అట్రాసిటీ ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం, పోలీస్ వ్యవస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ గుంటూరు బ్రాడీపేటలోని పీఎల్ రావు భవన్‌లోని కేవీపీఎస్ జిల్లా కార్యాలయంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. మాల్యాద్రి మాట్లాడుతూ దళితులపై అణచివేత కొనసాగుతున్న పరిస్థితుల్లో బహుజన సమాజం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. బాధితులు ఎన్ని ఫిర్యాదులు చేసినా పోలీసులు వెంటనే కేసులు నమోదు చేయకపోవడం, ఆలస్యం చేయడం, లేదా ఎఫ్ఐఆర్‌లు బలహీనంగా నమోదు చేయడం వల్ల న్యాయం జరగడం లేదని అన్నారు. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కరవది సుబ్బారావు మాట్లాడుతూ బాధితుల పక్షాన నిలబడే మానవ హక్కుల సంఘాలు, ప్రజాసంఘాలను ప్రభుత్వం అడ్డుకోవడం మానుకోవాలన్నారు. న్యాయవాది శిఖా సురేష్ మాట్లాడుతూ కేసులను తేలికగా తీసుకుంటే న్యాయ వ్యవస్థపై ప్రజల నమ్మకం దెబ్బతింటుందన్నారు. నేరస్తులను కఠినంగా శిక్షించడమే సమాజంలో మార్పు తీసుకొస్తుంన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి లక్ష్మణరావు మాట్లాడుతూ దళితులు గిరిజనుల మీద జరుగుతున్న దాడులకు నిరసనగా అన్ని దళిత గిరిజన సంఘాలతో పాటు వర్గ సంఘాలు కూడా తోడై ఐక్యంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. సెప్టెంబర్ 25న విజయవాడలో జరగబోయే ధర్నాలో పాల్గొని ప్రభుత్వాన్ని కదిలించేలా పోరాటం చేస్తామని తీర్మానం చేశారు. కార్యక్రమంలో పలు దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పులిచింతలకు 3,37,264 క్యూసెక్కులు విడుదల



టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్ నుంచి పులిచింతలకు విడుదలైన నీరు

సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద నున్న నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్ 16 క్రస్ట్ గేట్లు ద్వారా 3,37,264 క్యూసెక్కులు పులిచింతలకు విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణ, ఈఈ సుబ్రమణ్యం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెయిల్‌పాండ్ ప్రాజెక్టు రిజర్వాయర్ 16 క్రస్ట్ గేట్లు 4 మీటర్లు ఎత్తు ఎత్తి 3,37,264 క్యూసెక్కుల వరదనీటిని దిగువనున్న పులిచింతల ప్రాజెక్ట్‌కు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు నీటిమట్టం 75.50 మీటర్లకుగాను 74.78 మీటర్లకు నీరు చేరుకుందన్నారు. రిజర్వాయర్ గరిష్ఠ నీటిసామర్థ్యం 7.080 టీఎంసీలకుగాను ప్రస్తుతం 6.593 టీఎంసీలు నిల్వ ఉందన్నారు. రెండు విద్యుత్ యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పాదన నిలిపివేసినట్లు వెల్లడించారు. టీఆర్‌సీ లెవల్ 62.43 మీటర్లకు చేరుకుందన్నారు. ప్రస్తుతం నాగార్జునసాగర్ నుంచి ప్రస్తుతం 3,09,545 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. సాగర్ నుంచి వచ్చే వరదను బట్టి దిగువనున్న పులిచింతలకు నీటిని విడుదల చేస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



మృతి చెందిన చల్లా రాజేష్

పిడుగురాళ్ల: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన పట్టణంలోని విరాట్ నగర్ సమీపంలో గల విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఆదివారం జరిగింది. పట్టణ ఎస్ఐ శివనాగరాజు తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని చెరువు కట్ట బజారుకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ చల్లా రాజేష్(22) టిఫిన్ తీసుకొని వచ్చేందుకు ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. రోడ్డు తడిగా ఉండటంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డుపక్కన పడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కావటంతో రాజేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. మృతుడు రాజేష్ తల్లి కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివనాగరాజు తెలిపారు.